
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

కాకినాడ
జిల్లా వార్తలు
శుక్రవారం 5 జూలై 2024 | 5

కాకినాడలో కల్కి 'బుజ్జి' సందడి - 7లో
అన్నవరంలో హైవేపై ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు - 7లో
డయేరియానుంచి కోలుకుంటున్న వేద పాఠశాల విద్యార్థులు - 7లో



పవన్ భూమ్!

పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్తున్న 216వ జాతీయ రహదారి

- ఒక్కసారిగా భూముల ధరలకు రెక్కలు
- ఇంటి నిర్మాణానికి 3.52 ఎకరాలు కొనుగోలు చేసిన డిప్యూటీ సీఎం, జనసేనాని పవన్‌కల్యాణ్
- మరో 16 ఎకరాలు కొనేందుకు సన్నాహాలు
- సమీప ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసేందుకు జోరుగా ప్రయత్నాలు
- అక్కడ ఉన్న లేఅవుట్లలో స్థలాలకు అడ్వాన్సులు

ఆ ప్రాంతం ఒక్కసారిగా చర్చల్లోకి వచ్చింది. అక్కడ ఉన్న భూములు కొనుగోలు చేసేందుకు జోరుగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. నిన్నమొన్నటివరకూ ఎవరైనా వచ్చి కొనుగోలు చేస్తే చాలు అనుకున్న వారే రాత్రికి రాత్రి మనస్సు మార్చేసుకున్నారు. మేము చెప్పిన ధర ఇస్తేనే అమ్ముతామంటున్నారు. ఇదంతా పవన్‌కల్యాణ్ తన సొంతిల్లు, కార్యాలయం నిర్మాణం కోసం భూములు కొన్న ఫలితం. ఒక్కసారి రియల్ జోరు ప్రారంభమైంది. ఒక స్థలమైనా కొనే ప్రయత్నాల్లో జనసైనికులు ఉన్నారు.

పిఠాపురం, జూలై 4: పిఠాపురం నియోజకవర్గంలోని ఏదొక ప్రాంతంలో స్థలం కొని ఇల్లు కట్టుకుని ఇక్కడే ఉంటా అని ఎన్నికల ముందు చెప్పిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన సొంత ఇల్లు, కార్యాలయం నిర్మాణంకోసం పిఠాపురం పట్టణ శివారు ఇల్లింద్రాడ సమీపం లో గొల్లప్రోలు వైపు వెళ్లే 216వ జాతీయ రహదారిలో పుంతరోడ్డును చేర్చి 3.52 ఎకరాలను కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను బుధవారమే పూర్తి చేసి ఆ విషయాన్నే పిఠాపురం లో జరిగిన వారాహి సభలో ప్రకటించారు. అక్కడే ఇల్లు కట్టుకుంటానని, రెండెకరాల్లో కార్యాలయం నిర్మాణం చేపడతామని ప్రకటించారు. అంతే ఈ సమాచారం పిఠాపురం నియోజకవర్గంతోపాటు ఉభయగోదావరి జిల్లాలు, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వైరల్‌గా మారింది. పవన్ పిఠాపురంలోనే ఇల్లు కట్టుకుంటున్నారనే సమాచారం సోషల్ మీడియాలోనూ ట్రెండింగ్‌గా మారింది.

మరో 16 ఎకరాలకు..

3.52ఎకరాల్లో ఇల్లు, కార్యాలయం నిర్మించడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్న జనసేనానికి ఇక్కడే మరో 16ఎకరాల వరకూ భూమిని కొనుగోలు చేయనున్నారనే సమాచారం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే ఈ విషయంపై రైతులతో మాట్లాడి మౌఖిక ఒప్పందాలు జరిగినట్లు సమాచారం. పవన్‌కల్యాణ్ సొంతంగా ఈ భూములు కొంటున్నారా లేక కుటుంబసభ్యులు, స్నేహితులా అనేది ఇంకా బయటకు రాలేదు. పవన్ ఎన్నికల ప్రచార సమయంలో దేశ, విదేశాల్లో స్థిరపడిన తన సన్నిహితులు, అభిమానులు ఇక్కడ సాఫ్ట్‌వేర్ లేదా పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పిస్తానని ప్రకటించారు. అప్పట్లో సాఫ్ట్‌వేర్ రంగంలో పలువురు ఎన్‌ఆర్‌ఐలు ఇక్కడ ప్రచారం కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ కంపెనీల ఏర్పాటుకు ఇక్కడ ఏమైనా భూములు తీసుకుంటున్నారా అనే చర్చ జోరుగా సాగుతోంది.

భూములు కొనేందుకు..

పవన్ భూములు కొన్న ప్రాంతంలోనే పొలాలు కొనేందుకు పలువురు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. జనసేనలో క్రియాశీలకంగా ఉన్న నేతలతో పాటు పవన్ అభిమానులు, జనసైనికులు కనీసం అరెకరం నుంచి ఐదెకరాల వరకూ కొనుగోలు చేయాలని భావిస్తూ మధ్యవర్తులను సంప్రదిస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు చెందిన పలువురు మధ్యవర్తులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లు భూముల వేటలో బిజీగా ఉన్నారు. ఈ ప్రాంతం తరచూ ఏలేరు వరదల కారణంగా ముంపునకు గురవుతోంది. ఇక్కడ భూములు కొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపరు. పవన్ భూములు కొన్న తర్వాత పరిస్థితి మారిపోయింది.

ఆ భూములు ఎక్కడ..

పవన్ పిఠాపురం సమీపంలో భూములు కొనుగోలు చేశారనే సమాచారం బయటకు రావడంతో గురువారం ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పలువురు అవి ఎక్కడ ఉన్నాయో ఆరా తీసేందుకు పిఠాపురం వచ్చారు. పవన్ భూములు ఎక్కడ కొన్నారు, ఇంకా ఎంత భూములు అందుబాటులో ఉన్నాయి తదితర అంశాలు తెలుసుకునేందుకు వారు ఆసక్తి ప్రదర్శించారు. పవన్ భూములు కొన్న ప్రాంతాన్ని చూసేందుకు వచ్చేవారితో 216వ జాతీయ రహదారి సందడిగా మారింది.

ముంపు సమస్యకు పవన్ పరిష్కారం చూపుతారని పలువురు భావిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా బుధవారం రాత్రి, గురువారం కలిపి 15మంది తనను అక్కడ భూములు కొనేందుకు కావాలని అడిగారని క్రయ,విక్రయాల్లో మధ్యవర్తిగా ఉండే ఒకవ్యక్తి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ధరలు పైపైకి..

పవన్ భూములు కొన్న విషయం పైకి పొక్కడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు పెరిగిపోయాయి. రోడ్డు పక్కనే ఉన్న భూమి రూ.2కోట్ల వరకూ ఉంది. లోపల ఉన్న భూములు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకూ ఉన్నాయి. ఇప్పటివరకూ ఆ ధరలు కొనేందుకు ఎవరూ ముందుకు రాలేదు. 216వ జాతీయ రహదారిని చేర్చి ఉన్న భూముల కొందామని అనుకున్న వారికి ఎకరం రూ.3కోట్లు చెబుతుండగా లోపల భూముల ధరలు రూ.80లక్షలు నుంచి రూ.1.80కోట్లు వరకూ చెబుతున్నారు. ఇక్కడ సమీపంలో వేసిన లేఅవుట్లలో ఇళ్లస్థలాలకు విపరీతమైన డిమాండ్ పెరిగిపోయింది. పవన్ భూములు కొన్న ప్రాంతానికి ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో స్థలాల కోసం పదిమంది అడ్వాన్సులు చెల్లించేందుకు ముందుకు వచ్చారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గజం రూ.6వేల నుంచి రూ.8వేలకు అయినా విక్రయిద్దామని భావించిన సదరు వెంచర్ యజమానికి ఇప్పుడు ధరలను దాదాపు రెట్టింపు చేశారు. ఇక్కడకు సమీపంలోని లేఅవుట్లలో ధరలు గురువారం నాటికి పెరిగిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ధరలు మరింతగా పెరిగే అవకాశముందని భావిస్తున్నారు.

పవన్ భూములు కొనడంతో పిఠాపురం పట్టణ శివారు ప్రాంతాల్లో ఒక్కసారిగా రియల్ ఎస్టేట్ యాక్టివిటీ గణనీయంగా పెరిగింది. భూములు, స్థలాల కోసం ఎక్కువమంది ఒకేసారి అడుగుతుండడంతో వాటి యజమానులు ఆనందంలో ఉన్నారు. అడ్వాన్సులు ఇస్తామన్నా తీసుకోకుండా గతంలో చెప్పిన దానికంటే అధిక ధరలు చెబుతున్నట్లు సమాచారం. మధ్యవర్తులు కూడా ధర ఇంతే అని చెప్పలేకపోతున్నారు. యజమానికి వద్దకు తీసుకువెళ్తామని నేరుగా మాట్లాడుకోవాలని వారు సూచిస్తున్నారు. పవన్ ఇల్లు, కార్యాలయం నిర్మాణం పూర్తయితే రియల్ ఎస్టేట్ యాక్టివిటీ మరింత పెరుగుతుందని చెబుతున్నారు.



కాకినాడలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

సీతారామరాజు ధైర్యసాహసాలు

నేటి యువతకు ఆదర్శం: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 4: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చూపిన ధైర్యసాహసాలు వెలకట్టలేనివని, ఆయన స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమం, సీతారామరాజు స్మారక కళావేదిక ఆధ్వర్యంలో కాకినాడ నాగమల్లితోట జంక్షన్ వద్ద గల అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కాకినాడ కమిషనర్ వెంకట్రావు, జిల్లా అధికారులతో కలిసి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెకర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించడంలో విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు ప్రముఖపాత్ర పోషించారన్నారు. బ్రిటీష్ వారి దోపిడీపై గిరిజన ప్రజలకు చైతన్యం కలిగించడంలో విశేష కృషిచేసిన సమరయోధుడు అల్లూరి అని కొనియాడారు. సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, డీటీడబ్ల్యూవో విజయశాంతి, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, బీసీ సంక్షేమ అధికారి లల్లి పాల్గొన్నారు.

వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై కేసు నమోదు

- మెయిన్‌లో

- అక్రమ కట్టడాల కూల్చివేతల సమయంలో అధికారుల విధులకు ఆటంకం
- కాకినాడ టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కార్పొరేషన్ అధికారుల ఫిర్యాదు
- సెక్షన్ 132 బీఎన్ఎస్ చట్టం కింద 25మందిపై కేసు

ద్వారంపూడి రొయ్యల కంపెనీకి నోటీసులు

- మెయిన్‌లో

- రెండు యూనిట్లలో నిబంధనల ఉల్లంఘనలు గుర్తింపు
- కంపెనీ వ్యర్థజలాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండా గుట్టు
- గురజనాపల్లి ఫ్యాక్టరీలో ఇరుకుస్థలంలో నిబంధనలు ఉల్లంఘించి అధిక ఉత్పత్తి
- 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్న పీసీబీ

భానుగుడి జంక్షన్-కలెక్టరేట్ వరకు

ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డు

- 8లోగా బ్యానర్లు, హోర్డింగ్లు, ఫ్లెక్సీలు స్వచ్ఛందంగా తొలగించాలి: కలెక్టర్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 4: జిల్లా కలెక్టర్, కాకినాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ షాన్‌మోహన్ మున్సిపల్ కమిషనర్ వెంకటరావు, పట్టణ ప్రణాళికాధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రమైనందున రాజకీయ నాయకులు, ఇతర ముఖ్యవ్యక్తులు ముఖ్యంగా కాకినాడ నగరపాలక సంస్థల పరిధిలోని భానుగుడి జంక్షన్‌నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నందున హోర్డింగ్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ట్రాఫిక్‌కు ఇబ్బందిగా నగర సుందరీకరణకు అసౌకర్యంగా ఉండడంవల్ల ఈ రోడ్డును ఫ్లెక్సీ ఫ్రీ రోడ్డుగా నిర్ణయించారు. ఈనెల 8వతేదీసాయంత్రం లోపు స్వచ్ఛందంగా తొలగించాలని, లేకుంటే 9న ఉదయం నుంచి కాకినాడ నగరపాలక సంస్థ సిబ్బందితో తొలగిస్తామని తెలిపారు.

నాడు-నేడు పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 4: జిల్లాలో విద్యాశాఖకు సంబంధించి నాడు-నేడు పనుల్లో భాగంగా రెండో దశలో చేపట్టి మరుగుదొడ్ల పనులను జూలై 13 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పనులు రెండోదశ కింద ఇంకా 123 పాఠశాలల్లో మరుగుదొడ్లకు డోర్స్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ పనులను ఈనెల 13 నాటికి పూర్తి చేసి సంబంధిత ఎంఈవోలు నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో కలిపి 2.75లక్షల మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఒక స్కూల్ బ్యాగ్, ఒక జత షూస్, సాక్స్, రెండు జతల యూనిఫాం, నోట్‌బుక్స్ పాఠ్యపుస్తకాల కలిపి ఒక కిట్‌గా అందజేస్తామన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖధికారి రమేష్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ రమణమూర్తి, బీసీ సంక్షేమశాఖ అధికారి లల్లి, విజయశాంతి, వెంకటరాజు, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 4: ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన, ఉపాధికి దోహదం చేసే నైపుణ్య శిక్షణ విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ విద్యాధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్ కోర్టు హాలులో ఇంటర్మీడియట్, డిగ్రీ, సాంకేతిక కళాశాలలో బోధన సదుపాయాల సమస్యలపై అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి, రాష్ట్రానికి మంచి నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను అందించేలా ఉన్నత విద్యాబోధన ఉండాలని సూచించారు. యువతకు మెరుగైన, విస్తృతమైన ఉపాధి అవకాశాలను అందించేందుకు సేవా, పరిశ్రమల రంగాలు కోరుకుంటున్న నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అధ్యయనం చేసి వాటిపై శిక్షణలను ఉన్నత విద్యలో పొందుపరచాలన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతా ఫలితాల్లో గతేడాది రాష్ట్ర సగటు 80శాతం ఉండగా జిల్లాలో కేవలం 71శాతం ఉండడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఠాపురం, ఏలేశ్వరం డిగ్రీ కళాశాలల భవనాల నిర్మాణానికి స్థలం అందుబాటులో ఉన్నందున అవసరమైన నిధులు మంజూరుకు ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. సమావేశంలో పీఆర్ కళాశాల ప్రిన్సిపల్ తిరుపాణ్యం, ఇంటర్మీడియట్ విద్యాధికారి నూకరాజు, ప్రసాద్, ప్రశాంతిశ్రీ పాల్గొన్నారు.

'పీఏసీఎస్‌లకు సీఎస్‌సీ ద్వారా ప్రభుత్వ సేవలు'

కాకినాడరూరల్, జూలై 4: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) లకు కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ పరమైన సేవలు అందించడం ద్వారా వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్‌ను శ్రీనివాస్, ఎన్‌సీసీటీ కేంద్ర సహకార మంత్రిత్వశాఖ, డీసీవో వెంకటకృష్ణ, జీఎం ప్రవీణ్‌కుమార్ కలిసి సీఎస్సీ పోర్టల్‌పై శిక్షణ గురించి వివరించారు. ఈ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన 32 సేవలు, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి 174 సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన 288మంది కార్యనిర్వహణ అధికారులు, డేటా ఆపరేటర్స్ ఈనెల 4, 9 తేదీల్లో నిర్వహించబోతున్న శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొంటారని డీసీవో తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో ఆర్వీ నరసింహారావు, ఆప్కాబ్ డీపీడీఎం బాపూజీ పాల్గొన్నారు.

ద్వారంపూడి అవినీతితో.. పోర్టు కార్మికుల జీవితాలు చీకటిమయం



కాకినాడ పోర్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

- కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు
- ఛాంబర్ ప్రతినిధులు, బార్జ్ఓనర్స్‌తో కలిసి కాకినాడ పోర్టు పరిశీలన

కాకినాడ సిటీ, జూలై 4: మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి దురాగతంతో కాకినాడ పోర్టు గుడ్‌విల్ దెబ్బతిందని, పోర్టుపై ఆధారపడి జీవిస్తున్న 20వేలమంది పోర్టు కార్మికుల జీవితాలు చీకటిమయంలో పడ్డాయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆందోళన వ్యక్తం చేశారు. బార్జీ ఓనర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారులు దారుణంగా నష్టపోయే పరిస్థితి కాకినాడ పోర్టులో నెలకొందన్నారు. ఛాంబర్ ప్రతినిధులు, బార్జ్ ఓనర్స్‌తో కలిసి గురువారం ఆయన కాకినాడ పోర్టు ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి స్వార్థ ప్రయోజనం కోసం, అక్రమ వ్యాపారాల కోసం కాకినాడ పోర్టును అడ్డాగా చేసుకుని దోచుకున్నారని, వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ద్వారంపూడి చేసిన అక్రమాల ఫలితంగా కాకినాడ పోర్టుకు భారీనష్టం వాటిల్లుతోందని అన్నారు. పోర్టుల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తే వైసీపీ ప్రభుత్వం వచ్చాక పోర్టు భూములను తాకట్టు పెట్టి వచ్చిన సొమ్ములు వాటాల రూపంలో పంచుకున్నారన్నారు. ద్వారంపూడి అనుచరుడు షాన్‌మేరైన్ అధినేత అలీషా 3100 స్కేర్‌యార్డుల భూమిని లీజుకు తీసుకుని 6వేల స్కేర్ యార్డుల భూమిని ఆక్రమించుకుని అక్రమ వ్యాపారం చేస్తున్నా అధికార యంత్రాంగం నిద్రలో నటించిందన్నారు. వాటాల పంపకాల కోసం ఒక పనిని రెండుసార్లు ప్రారంభోత్సవాలు చేసి డ్రెడ్జింగ్ పేరుతో కోట్లు నొక్కేసి అరకొరగా పూర్తి చేసినా పోర్టు అధికారి నోరు మెదపకపోవడం వెనుక ద్వారంపూడి హస్తం ఉందని తెలిపారు. రెండుసార్లు శంకుస్థాపనలు చేసిన విషయం పత్రికల్లో కూడా వచ్చిందన్నారు. డ్రెడ్జింగ్ పూర్తి చేసి నాలుగునెలలు కాకపోయినా సముద్రంలో ఇసుకమేటలు తగిలి బార్జీల కార్యకలాపాలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. తక్షణమే పోర్టులో జరుగుతున్న చట్టవ్యతిరేక పనులపై పోర్టుఅధికారి జోక్యం చేసుకుని ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో లీజు వసూలు చేయాలని ఆదేశించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ఐపీఎల్ బాబు, డాక్టర్ రామ్మూర్తి, పెనుపోతు సూర్యారావు, సత్తిబాబు, మడ్డు విజయ్, కర్రి భద్రరావు, మల్లిపూడి వీరు, తుమ్మల రమేష్ ఉన్నారు.

జింబాబ్వే విద్యార్థినులకు డయేరియా



డయేరియా బాధితులను పరామర్శిస్తున్న కమిషనర్

- పరామర్శించిన కార్పొరేషన్ కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 4: కాకినాడలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుతున్న జింబాబ్వే దేశానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు డయేరియా బారిన పడ్డారు. వెంటనే వీరిని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తున్నారు. జింబాబ్వే నుంచి ఇక్కడకు వచ్చి డిగ్రీ చదువుతున్న వీరు అకస్మాత్తుగా బుధవారం అస్వస్థతకు గురవడంతో కళాశాల యాజమాన్యం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించింది. విషయం తెలిసిన వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఆదేశాల మేరకు కాకినాడ నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ పృథ్వీచరణ్, ఆహార తనిఖీ అధికారులు విద్యార్థులు ఉంటున్న హాస్టల్‌ను సందర్శించారు. అక్కడి పరిసరాల పరిశుభ్రత, శానిటేషన్‌ను పరిశీలించారు. ఎటువంటి లోపాలు కనిపించలేదని అధికారులు స్పష్టం చేశారు. హాస్టల్‌లో ఉంటున్న ఏడుగురికి మాత్రమే డయేరియా రావడంపై బయటకు వెళ్లి ఆహారాన్ని సేవించారా, ఎక్కడ తిన్నారు వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు. డయేరియాతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జింబాబ్వే విద్యార్థినులను కాకినాడ కమిషనర్ వెంకటరావు పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ఎక్కడైనా డయేరియా పరిస్థితులు కనిపిస్తే కాకినాడ నగరపాలక సంస్థ టోల్‌ఫ్రీ నెంబర్ 18004255990కు కాల్ చేయాలన్నారు.

కోనో కార్పస్ చెట్లను తక్షణమే తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 4: కాకినాడ పట్టణంలో పర్యావరణానికి హాని కలిగించే కోనోకార్పస్ చెట్లను తొలగించి వాటిస్థానంలో ప్రాణవాయువు విడుదల చేసే మొక్కలు నాటేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో కోనోకార్పస్ చెట్ల తొలగింపు, ఫ్లెక్సీలు లేని స్ట్రీట్ వంటి అంశాలపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గుపులుసు వాయువు అధికంగా విడుదల చేసే కోనోకార్పస్ చెట్లను తొలగించి ప్రాణవాయువు అందించే మొక్కలను పెంచేలా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. కాకినాడ పట్టణ పరిధిలో 4,602 కోనోకార్పస్ చెట్లు గుర్తించినట్లు మున్సిపల్ అధికారులు వివరించారు. తొలిదశ కింద కాకినాడ పట్టణ పార్కుల్లో ఉన్న కోనోకర్పస్ చెట్లను తొలగించాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారులను సమన్వయం చేసుకుని తొలగించిన చెట్ల స్థానంలో వెంటనే ఆక్సిజన్ విడుదల చేసే మొక్కలు నాటేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలన్నారు. సమావేశంలో కాకినాడ కమిషనర్ వెంకటరావు, టౌన్ ప్లానింగ్ అధికారి హరిదాస్, హార్టీకల్చర్ ఏడీ సరీల్, పద్మజ పాల్గొన్నారు.

గడువు ముగిసిన

సాస్ సరఫరా

- ఫుడ్ కంట్రోలర్ అధికారికి ఫిర్యాదు
- సెక్షన్ 58 ప్రకారం రెస్టారెంట్‌పై జేసీ కోర్టులో కేసు నమోదు

సర్పవరం జంక్షన్, జూలై 4: కాకినాడ రూరల్‌లోని ఓ మాల్‌లో ప్రముఖ కార్పొరేట్ సంస్థకు చెందిన ఆహారపు రెస్టారెంట్‌లో వినియోగదారుడికి గడువు ముగిసిన సాస్ సరఫరా చేయడం, చికెన్‌తో సాస్ తిన్న బాలిక వికారంగా ఉండడంతో ఆమె తల్లి ఫుడ్ కంట్రోలర్ అధికారికి ఫిర్యాదు చేసింది. దీనిపై అధికారులు స్పందించి అక్కడకు చేరుకుని ఆ సాస్ కేసు నమోదు వివరాల్లోకి వెళ్తే రాజమహేంద్రవరానికి చెందిన వివాహిత నాలుగో తరగతి చదువుతున్న కుమార్తె, తల్లితో కలిసి సర్పవరం జంక్షన్‌లోని ఎస్ఆర్ఎంటీ మాల్‌లోని కార్పొరేట్ రెస్టారెంట్‌కి వచ్చారు. అక్కడ ఫ్రైబిట్ చికెన్ ఆర్డర్ ఇవ్వగా సాస్‌తో చికెన్ సరఫరా చేశారు. సాస్ నంజుకుని ముగ్గురు చికెన్ తిన్నారు. సాస్‌పై డేట్ పరిశీలించగా జూన్ 5వ తేదీకి గడువు ముగిసినట్లు ఉండడాన్ని గమనించి కుమార్తెను తినవద్దని వారించింది. ఈలోగా వాంతుల లక్షణాలు కనిపించడంతో ఆందోళనతో యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. వాళ్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో కాకినాడ ఫుడ్అధికారులకు ఫిర్యాదు చేసింది. జిల్లా ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వచ్చి శాంపుల్స్‌ను పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పరిశీలించగా గడువు ముగిసిన సాస్ ఉన్నట్లు తేలడంతో సెక్షన్ 58 ప్రకారం సదరు రెస్టారెంట్‌పై జేసీ కోర్టులో కేసు నమోదు చేశామని జిల్లా ఫుడ్ కంట్రోలర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

'వారాహి కాలనీ'

- మెయిన్‌లో

- కబ్జా విముక్త స్థలానికి నామకరణం
- కడప వాసి చెర నుంచి 4.86 ఎకరాలు స్వాధీనం

మాజీ ఎంపీ మార్గాని భరత్ ప్రచార రథం దహనం

వైసీపీ కార్యకర్త 'ప్లానింగే'..

- ఎన్నికల్లో ఓడిపోయిన భరత్‌కు సానుభూతి తీసుకొచ్చేందుకు ప్రయత్నం
- పక్కా ప్రణాళికతో ప్రచార రథాన్ని తగలబెట్టిన వైనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ కిశోర్‌కుమార్



విలేకర్లకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కిశోర్‌కుమార్

రాజమహేంద్రవరం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రచార రథాన్ని వైసీపీ కార్యకర్త.. అదీ భరత్ తండ్రి మార్గాని నాగేశ్వరరావు ముఖ్య అనుచరుడే తగలబెట్టేశాడు. దీనికి ప్రొఫెషనల్ క్రిమి నల్ కంటే తెలివిగా ఆలోచన చేయడం పోలీసులను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ మేరకు వివరాలను ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరం వీఎల్ పురానికి చెందిన దంగేటి శివాజీ కొన్నేళ్ల నుంచి వైసీపీ కార్యకర్తే కాకుండా మార్గాని నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడు. భరత్ కార్యాలయం ఉన్న మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోనే ఎక్కువ సమయం గడిపేవాడు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో భరత్ ఓడి పోవడంతో ఆవేదన చెందాడు. ఎలాగైనా ఏదో ఒకటి చేసి టీడీపీ వాళ్లపైకి నెపం నెట్టేయాలని, భరత్‌పై ప్రజల్లో సానుభూతి వచ్చే విధంగా చేయాలని పథకం వేశాడు. ఈ క్రమంలో గత నెల 28న శివ మరికొంతమంది కలిసి రాత్రి 10 గంటల వరకూ మార్గాని ఎస్టేట్స్‌లోని రచ్చబండ వద్ద మద్యం తాగారు. తర్వాత ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో తన బైక్ నుంచి శివ ఒక ప్లాస్టిక్ కవర్లోకి పెట్రోలు తీశాడు. ఒక దుకాణంలో దోమల చక్రం, అగ్గిపెట్టె కొన్నాడు. దోమల చక్రం చిన్న ముక్క విరిపి దానికి నాలుగు అగ్గిపుల్లలు వెలిగే కొనను ప్లాస్టిక్ తాడుతో కట్టాడు. వీటిని తీసుకొని ప్రచార రథం వద్దకు వెళ్లాడు. ఎదుటవైపు టైరుపై పెట్రోలు ఉన్న కవర్‌ని ఉంచి.. దానిపై అగ్గిపుల్లలు కట్టిన భాగం పెట్టాడు. మరొకవైపు దోమల చక్రం ముక్కను వెలిగించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఇదంతా ఒక నిమిషంలో చేసేశాడు. దోమల చక్రం వెలుగుతూ వచ్చి అగ్గిపుల్లలు మండి ఆపై పెట్రోల్ కవర్‌కి నిప్పు అంటుకొని పెట్రోల్‌తో మంటలు చెలరేగాయి. ఇవన్నీ టైరుపై ఉండడంతో మరింత వేగంగా మంటలు వ్యాపించాయి. దీంతో ప్రచార రథం దగ్ధమైందని డీఎస్పీ వివరించారు. శివాజీకి అతని స్నేహితుడు బాలు ఫోన్ చేసి భరత్ ఆఫీసు వద్దకు పోలీసులు ఎందుకు వచ్చారని ప్రశ్నించాడన్నారు. అయితే ఏమీ తెలియనట్లు విషయం ఆరా తీస్తానని చెప్పి మార్గాని నాగేశ్వరరావుకు శివాజీ ఫోన్ చేశాడన్నారు. ఏమైందో తెలుసుకుంటానని చెప్పిన నాగేశ్వరరావు.. ఐదు నిమిషాల తర్వాత శివాజీకి ఫోన్ చేసి ఎవరో ప్రచార రథానికి నిప్పు పెట్టి కాల్చేశారని చెప్పారని డీఎస్పీ తెలిపారు. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 435 కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అతడిపై చాలా ఏళ్ల క్రితం ఓ కేసు ఉన్నట్లు తెలుస్తోందని.. పూర్తి వివరాలపై ఆరా తీస్తున్నామన్నారు. కేసును మూడు రోజుల్లో ఛేదించిన బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, ఎస్ఐ బి.శ్రీను, ఆర్.అంకారావు, కె.జగన్మోహన్‌రావు(కొవ్వూరు టౌన్), హెచ్‌సీలు పి.వెంకటేశ్వరరావు(బొమ్మూరు), కె.సురేశ్‌బాబు(అనపర్తి), కానిస్టేబుళ్లు కె.సురేశ్‌బాబు(బొమ్మూరు), కె.తిరుమల యాదవ్(బిక్కవోలు) బృందాన్ని ఎస్పీ జగదీశ్ ప్రత్యేకంగా అభినందించారు.

మైండ్ బ్లోయింగ్ ప్లాన్

కేసును ఛేదించడానికి పోలీసులు చాలా కష్టబడాల్సి వచ్చింది. భరత్ కార్యాలయానికి దూరంగా ఉన్న ఒక షెడ్డులో ఈ రథాన్ని ఉంచారు. అక్కడి సీసీ కెమెరాలు అంతదూరం పని చేయవు. దీంతో ఓ స్కూలు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. గతంలో తమ దర్యాప్తుల్లో ఎన్నడూ చూడని ప్లాన్‌ని నిందితుడు, వైసీపీ కార్యకర్త దంగేటి శివాజీ వేయడం చూసి నివ్వెరపోయారు. యూట్యూబ్‌లో వీడియోలు వెతికి ఈ ప్లాన్ ఎంచుకున్నట్లుగా తెలుస్తోంది. మామూలు ప్లాస్టిక్ కవరైతే వెంటనే కాలిపోతుందని అల్యూమినియం ఫాయిల్ కవర్‌లో పెట్రోలు నింపుకున్నాడు. దానిని వెలిగిస్తే ఒక్కసారిగా పెద్ద మంటలు వచ్చి జనం గుమిగూడతారని దోమల చక్రానికి అగ్గిపుల్లలు కట్టాడు. ఆ దోమల చక్రం నెమ్మదిగా వెలుగుతూ అగ్గిపుల్లల వద్దకు వచ్చే సరికి సమయం పడుతుంది. దీంతో ఎవరికీ అనుమానం రాదని ప్లాన్ వేశాడు. ఈ సరంజామాను వ్యానుపై పెడితే పెద్దగా ఫలితం ఉండదని టైరుపై ఉంచాడు. టైరు రబ్బరు కావడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. కాగా.. 28 రాత్రి ఘటన జరగ్గా 2వ తేదీన పోలీసులకు వైసీపీ నగరాధ్యక్షుడు అడపా శ్రీహరి ఫిర్యాదు అందజేయడంతో అప్పట్లోనే అనుమానాల వ్యక్తం కావడం గమనార్హం.

కారు ఢీకొని వృద్ధుడి మృతి



ఆలమూరు, జూలై 4: మండలంలోని మూలస్థానం గ్రామానికి చెందిన రేలంగి సూర్యనారాయణ (60)ను కారు ఢీకొనడంతో మృతిచెందారు. సూర్యనారాయణ పువ్వుల వ్యాపారం చేస్తుంటారు. గురువారం జొన్నాడ నుంచి ఇంటికి తిరిగి వెళ్తుండగా మూలస్థానం వద్ద రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వెళ్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేయగా ఆలమూరు ఎస్ఐ శ్రీనునాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళపై ఆటోడ్రైవర్ దాడి



స్పృహతప్పి పడిపోయిన మహిళ

రౌతులపూడి, జూలై 4: కాకినాడ జిల్లా రౌతులపూడి సినిమా సెంటర్‌లో ఒంటరి మహిళపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. తీవ్రంగా కొట్టడంతో స్పృహ తప్పిపడిపోయింది. వ్యాపారస్తులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములగపూడి గ్రామానికి చెందిన కె.లక్ష్మి ఆటోలో రౌతులపూడి వచ్చింది. ఆటోలో నుంచి దిగిన మహిళపై అక్కడే ఉన్న వీరాస్వామి అనే ఆటో డ్రైవర్ ఒక్కసారిగా విచక్షణారహితంగా దాడి చేశాడు. దీంతో లక్ష్మి స్పృహ తప్పిపడిపోయింది. తనపై కేసు పెడతావా అంటూ ఆటోడ్రైవర్ దాడి చేశాడని వ్యాపారస్తులు, స్థానికులు తెలిపారు. విషయం తెలిసి లక్ష్మి బంధువులు రావడంతో ఆటో డ్రైవర్ పరారయ్యాడు. బంధువులు లక్ష్మిని తీసుకుని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని జట్టు కూలీ మృతి

అమలాపురం రూరల్, జూలై 4: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్ర వంతెన వద్ద జట్టు కూలీగా పని చేస్తున్న తొత్తరమూడి బులి సత్యనారాయణ (52) పని ముగించుకుని గురువారం రాత్రి సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా భట్నవిల్లి జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 4 : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన మెల్లిమి రాజుకు వివాహం జరిగింది. భార్యతో మనస్పర్థలు కారణంగా విడిగా ఉంటున్నాడు. కొత్తూరు గ్రామంలో టిడ్కో గృహంలో నివసిస్తున్నాడు. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో రోజూ మద్యం సేవిస్తున్నాడు. రాజు తల్లి విజయలక్ష్మీ పింఛను నిమిత్తం ఈనెల 1న దంగేరు గ్రామం వెళ్లింది. 2వ తేదీన రాజు తల్లి విజయలక్ష్మీకి ఫోన్ చేసి తన భార్య వచ్చి గొడవపడి వెళ్లినట్లు తెలిపాడు. గురువారం ఉదయం 11 గంటలకు విజయలక్ష్మీ టిడ్కో గృహం వద్దకు వచ్చి చూడగా తలుపులు వేసి ఉంది. కిటికిలో నుంచి చూడగా లోపల నుండి వాసన వస్తుంది. చుట్టుపక్కల వారిసాయంతో తలుపులు తెరచి చూడగా బెడ్‌రూమ్‌లో చీరతో రాజు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. దీంతో విజజయలక్ష్మి ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అయినవిల్లి, జూలై 4: మండలంలోని వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన అడపా ప్రేమ్‌కుమార్ (29) గురువారం ఇంట్లో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు అమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు వారు తెలిపారు. ఈ ఘటనపై అతని సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజేష్‌కుమార్ తెలిపారు. ప్రేమ్‌కుమార్‌కు భార్య రమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

ప్రత్తిపాడు, జూలై 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం జాతీయ రహదారిపై గురువారం వాహనం ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. ధర్మవరం శివారు పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపై నడుస్తున్న గుర్తు తెలియని 30 ఏళ్ల యువకుడిని రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడు. యువకుడు ఆచూకీ తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తూ..

ప్రైవేటు బస్సు ఢీకొని భార్య మృతి..

భర్తకు తీవ్రగాయాలు



మృతిచెందిన లక్ష్మి

తొండంగి, జూలై 4: ఒంట్లో నలతగా ఉండడంతో ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని బయలుదేరిన ఆమె ఇంటికి చేరకుండానే ప్రమాదానికి గురై మృతిచెందింది. గురువారం కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు రావికంపాడు సెంటర్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఎద్దు లక్ష్మి అనే మహిళ మృతి చెందగా ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం రావికంపాడు గ్రామానికి చెందిన ఎద్దు లక్ష్మి(53) అనారోగ్యంతో బాధపడుతుండడంతో భర్త జగ్గయ్య ఆమెను మోటార్ సైకిల్‌పై కత్తిపూడి ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు.తిరిగి అన్నవరం వైపు వస్తుండగా వెనుక నుంచి ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. భర్త జగ్గయ్యకు తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి ఎస్ఐ వినయ్ ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

160 కిలోల గంజాయి స్వాధీనం

మోతుగూడెం, జూలై 4: డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద గురువారం డొంకరాయి ఎస్ఐ శివకుమార్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేయగా 160 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను, 2 ఆటోలను అదుపులోకి తీసుకున్నారు. పాల్వంచ గ్రామానికి చెందిన షేక్ అక్బర్ హైదరాబాద్‌కు చెందిన షేక్ ఖాజావలి నాలుగు రోజుల క్రితం భద్రాచలం నుంచి సీలేరుకు పాసింజర్‌లను ఎక్కించుకుని అనంతరం పాసింజర్‌లను సీలేరులో దింపి సీలేరులోనే నాలుగురోజులు జల్సాగా తిరిగారు. సీలేరులో ఒక వ్యక్తి వారి వద్దకు వచ్చి గంజాయి భద్రాచలం తీసుకెళ్తే రూ.30 వేలు కిరాయి ఇస్తామని చెప్పడంతో ఆటోలో 80 కిలోల గంజాయి చొప్పున రెండు ఆటోల్లో 160 కిలోల గంజాయి పెట్టుకుని గురువారం సీలేరు నుంచి భద్రాచలం బయలుదేరుతుండగా గంజాయి రవాణా చేస్తున్న సదురు రెండు ఆటోలను వెహికల్ చెకింగ్ చేస్తున్న డొంకరాయి ఎస్ఐ శివకుమార్ పట్టుకుని గెజిటెడ్ అధికారి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వెంకట నానాజీ, వీఆర్వో సందీప్‌ఆచార్యులు, సురేష్ సమక్షంలో సీజ్ చేసి షేక్ అక్బర్, షేక్ ఖాజావలిను అరెస్ట్ చేశారు. చింతూరు సీఐ గజేంద్రకుమార్ ఆదేశాల మేరకు రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌కు రిమాండ్ నిమిత్తం తరలించారు.

100 కిలోల గంజాయితో అరెస్టు

చింతూరు, జూలై 4 : చింతూరు పోలీసులు గురువారం వంద కిలోల గంజాయితో పాటు రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు మేరకు.. చింతూరు పోలీసు స్టేషను ముందు వాహన తనఖీలు చేస్తుండగా తెలంగాణ వైపు వెళుతున్న రెండు కార్లు అనుమానాస్పదంగా కనిపించాయి. దీంతో కార్లను నిలువరించి విచారణ చేపట్టగా ఆయా కార్లలో ప్రయాణిస్తున్న వారు 100 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో గంజాయి తరలింపునకు పాల్పడ్డ నలుగురు నిందితులతో పాటు కార్లకు పైలట్‌గా వ్యవహరించిన మరో ఇద్దరిని కూడా అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా, తొర్రూర్ మండలం హరిపిరాల గ్రామానికి చెందిన హపవత్ రమేష్, అదే గ్రామానికి చెందిన బాణోత్ రవీందర్, ప్రకాశం జిల్లా కొండపి గ్రామానికి చెందిన మాదాల వెంకటేశ్వరరావు, ఒడిసా రాష్ట్రం, మల్కానగిరి జిల్లా అల్లూరికోటకు చెందిన మరిగెల వెంకటరావు, అదే గ్రామానికి చెందిన మరిగెల సత్తి, మరిగెల చంటిబాబు అరెస్టైన వారిలో ఉన్నారు. వారి నుంచి రూ. 1 లక్షా 40 వేలు కూడా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

డయేరియా నుంచి కోలుకుంటున్న వేద విద్యార్థులు



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న వైద్యులు

అన్నవరం, జూలై 4: అన్నవరం దేవస్థానంలో కలకలం రేపిన ఆగమ పాఠశాల విద్యార్థుల డయేరియాకు సంబంధించి పరిస్థితులు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. విద్యార్థులు వేగంగా కోలుకున్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రంగరాయ మెడికల్ కళాశాల ప్రొఫెసర్ ఎస్.పి.ఎం డిపార్ట్‌మెంట్ అధికారి డాక్టర్ రుక్మిణి, డిప్యూటీ జిల్లా వైద్యశాఖాధికారి డాక్టర్ సరిత శివసదన్ కాటేజీలో ఉన్న వేద విద్యార్థులను కలిసి ఆరోగ్యంపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. అదే విధంగా తాగునీరు, వంట పదార్థాల శాంపిల్స్‌ను గురువారం తీసుకుని వారి వెంట తీసుకెళ్లారు. శాంపిల్స్ రిపోర్టులు శుక్రవారం వస్తాయని తెలిపారు. ఇదిలాఉండగా విద్యార్థులు కోలుకోవడంతో 31 మందికి వారం రోజులు సెలవు మంజూరు చేసి తల్లిదండ్రుల చెంతకు పంపించే ఆలోచనలో ఉన్నారు. శుక్రవారం ఈవో రామచంద్రమోహన్ దీనిపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆగమ పాఠశాల ప్రాంగణమంతా శానిటైజ్ చేసి మరింత పరిశుభ్రం చేసే పనులు అధికారులు చేపట్టారు. ఏఈవో కృష్ణారావు, సూపరింటెండెంట్ స్వామీజీ పర్యవేక్షణ చేస్తున్నారు.

తెరపైకి ఆ ఐదు పంచాయతీలు

నేడు తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం

ఎటపాక, జూలై 4: రాష్ట్ర పునర్విభజన సమయంలో భద్రాచలం మండలంలో భద్రాచలం రెవెన్యూ గ్రామం మినహా మిగిలిన గ్రామాలన్నీ పోలవరం ముంపు పేరుతో ఏపీ పరిధిలో కలిశాయి. గత దశాబ్ద కాలం నుంచి ఆ గ్రామాలు పాలనపరంగా ఏపీ పరిధిలో కొనసాగుతున్నాయి. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారడంతో విలీన అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఆ ఐదు పంచాయతీలైన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలనే డిమాండ్ విన్పిస్తోంది. వారం రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆ ఐదు పంచాయతీలు తెలంగాణకు వస్తేనే భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందుతుందని, ఆ పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు ఏపీ ప్రభుత్వాన్ని అడుగుతామని చెప్పడంతో ఆ పంచాయతీల విలీన ప్రక్రియపై మరింత వేడి రాజుకుంటోంది. ఈక్రమంలోనే గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలు రెండు రోజుల క్రితం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు వినతి పత్రం అందించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఏపీ పరిధిలో కలిసిన ఎటపాక, పిచుకలపాడు, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపి, భద్రాచలం పుణ్యక్షేత్ర అభివృద్ధికి కృషి చేస్తామని ప్రస్తావించారు. అయితే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈ డిమాండ్ ఇటీవల కాలంగా గట్టిగా విన్పిస్తోంది.

తెలంగాణ సీఎంను కలవనున్న అఖిలపక్షం, ప్రజాప్రతినిధులు

శుక్రవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఈ ఐదు పంచాయతీల్లోని అఖిలపక్ష నాయకులు, ప్రజా ప్రతినిధులు కలవనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి తమ గోడును వినిపించనున్నారు. ఏపీలో పాలనా పరంగా పడుతున్న ఇబ్బందులను తెలియజేస్తూ తమ గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని విన్నవించనున్నారు. ఆంధ్రా, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి భేటీ కానుండడంతో ఈ అంశం చర్చకు వస్తుందనే ఆశాభావంతో ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

దుర్గాడ శివాలయంలో ప్రత్యేక పూజలు



గొల్లప్రోలు రూరల్, జూలై 4: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్టబహుళ త్రయోదశి, తత్కాల చతుర్దశి, మాసశివరాత్రి సందర్భంగా మహాగణపతిపూజ, మహాన్యాసపారాయణ, 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నేరేడుపండ్లు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, స్మార్త ఆగమ పండిత విద్యార్థులు అల్లంరాజు రామకృష్ణశర్మ, ఫణిశర్మ, చెరకూరి కారుణ్యశర్మ, కార్తీక్‌శర్మ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

సీతానగరంలో 11 డయేరియా కేసులు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, జూలై 4: సీతానగరంలో 11 మంది డయేరియా లక్షణాలతో పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. బాధితులను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గురువారం పరామర్శించారు. బాధితులకు అందుతున్న సాయంపై ఆరా తీశారు, రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు, ఆహార పదార్థాల శుభ్రత అవసరమన్నారు. గ్రామంలో 11 కేసులు గుర్తించడంతో డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు సీతానగరంలో పర్యటించారు. రోగులను పరామర్శించి స్థానిక పంచాయతీలో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి వస్తున్న కుళాయి వద్ద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో డయేరియా కేసులున్నాయని, అయితే అవి రికవరీ దిశలో ఉన్నాయన్నారు. అవసరమైన మందులు పీహెచ్‌సీలో ఉన్నాయని, రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే రెండు సార్లు మెడికల్ క్యాంపులు పెట్టారని, డయేరియా అని కాకుండా సస్పెక్టెడ్ కేసులుగా పరిగణించి వైద్య సేవలందించారని, కారణాలను విశ్లేషిస్తున్నామని చెప్పారు.

ప్రసాద విక్రయ కేంద్రాలు ఏర్పాటు

అన్నవరం, జూలై 4: జాతీయ రహదారిపై రాజమహేంద్రవరం వైపు వెళ్లే భక్తుల కోసం నిర్మించిన సత్యదేవుడి నూతన నమూనాలయం వద్ద ప్రసాదం విక్రయ కేంద్రాలను సిద్ధం చేశారు. ఆషాడమాసంలో తలుపులమ్మ లోవ దర్శించుకుని తిరిగి వెళ్లే భక్తులు అన్నవరం సత్యదేవుడి ప్రసాదాన్ని కొనుగోలు చేసి తమ స్వస్థలాలకు తీసుకెళుతుంటారు. అయితే ఎన్నికలకు ముందు ఆలయాన్ని ప్రారంభించినా పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. లోవ భక్తుల రద్దీ దృష్ట్యా నూతన ప్రసాదం కౌంటర్లు సిద్ధం చేయాలని, ఆషాడమాసం నుంచే విక్రయ కౌంటర్ ప్రారంభించాలని ఈవో ఆదేశించడంతో వెంటనే సిద్ధం చేశారు. ఈనెల 7వ తేదీ మొదటి ఆదివారం కావడంతో 6వ తేదీ నుంచి ప్రారంభించాలని ఆలోచన చేస్తున్నారు. రెండు టిక్కెట్లు కౌంటర్లు, రెండు ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే రద్దీని బట్టి రెండో కౌంటర్‌ను వినియోగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కాకినాడలో కల్కి 'బుజ్జి' సందడి



సర్పవరం జంక్షన్, జూలై 4: ప్రముఖ హీరో ప్రభాస్ నటించిన కల్కి సినిమాలో ప్రముఖ పాత్ర వహించిన బుజ్జి కారు కాకినాడలో సందడి చేసింది. సినిమాలో హీరోకు ఉన్న ప్రాధాన్యం బుజ్జి కారుకు లభించింది. సినిమాలో ఈ కారు చేసే విన్యాసాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టున్నాయి. ఈ కారును గురువారం కాకినాడ రూరల్ సర్పవరం జంక్షన్‌లో ఎస్ఆర్ఎంటీ మాల్‌లో ఈవెంట్ నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. దీనిని తిలకించేందుకు జిల్లా నలు మూలల నుంచి సందర్శకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ స్తంభించడంతో ట్రాఫిక్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది క్రమబద్ధీకరించారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ విషయంలో ఘోర తప్పిదాలు

ప్రాజెక్టులో జరిగిన తప్పిదాలు, ఖర్చులు, నష్టాలపై హైకోర్టులో పిల్ వేస్తా

అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, జూలై 4 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక ఘోర తప్పిదాలు జరిగాయని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ ఆరోపించారు. రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో తన చాంబర్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా పోలవరానికి అంకురార్పణ చేశారని చెప్పారు. అటుపై కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య, విభజిత ఏపీలో టీడీపీ అధినేత చంద్రబాబు నిర్మాణాలు కొనసాగించారని చెప్పారు. కానీ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు నిర్మాణ సంస్థలు, ఇంజనీర్లు మారిపోయారని చెప్పారు. తొలుత శీనయ్య కమిటీ ఈ ప్రాజెక్టు విషయంలో స్పష్టంగా చెప్పిందని రెండు డయా ఫ్రం వాల్స్ నిర్మించాలని సూచించిందన్నారు. కాని ఒకటే నిర్మించారని చెప్పారు. ఇది ఘోర తప్పిదమన్నారు. ప్రపంచంలో అన్ని ప్రాజెక్టులు రాతి పొరల మీద నిర్మించారు. నాగార్జున సాగర్ డ్యామ్ కూడా రాతి పొర మీదే అయితే పోలవరం నిర్మించేది ఇసుక పొరల మీద అని ఇది చాలా స్ట్రాంగ్‌గా నిర్మించాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో నిర్మాణాలు జరిగితే జగన్ ప్రభుత్వంలో మళ్లీ ఇంజనీర్లు కంపెనీలు మార్చి నిర్మించారన్నారు. 50 లక్షల క్యూసెక్కులు నీరు వచ్చిన తట్టుకునేలా స్పిల్‌వే నిర్మాణం చేశారు కానీ డయా ఫ్రం వాల్ విషయంలో తప్పు చేశారన్నారు. దీని వల్ల వరదల సమయంలో ఏ మాత్రం తేడా వచ్చినా తూర్పుగోదావరి నుంచి కాకినాడ జిల్లా వరకు మొత్తం గల్లంతై పోతాయన్నారు. చాలా శ్రద్ధ తీసుకుని ముందుజాగ్రత్తలు తీసుకుని ప్రాజెక్టు నిర్మాణం చేయాలన్నారు. రెండు డయాఫ్రం వాల్స్ కడితేనే ప్రమాదం ఎదుర్కొనగలమన్నారు. ఒక దానికి ఒకదానికి మధ్య 3 నుంచి 5 మీటర్లు గ్యాప్‌లు ఉండాలని శీనయ్య కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్దేశించిందన్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో ఇంజినీరు సీతాపతిరావుతో పాటు చాలా మంది రెండు డయాఫ్రం వాల్స్ అవసరం లేదని ఒకటి చాలు అని చెప్పడం, దీని వల్ల ఖర్చుతగ్గుతుందని చెప్పారని ఇది కరెక్ట్ కాదన్నారు. ఖర్చు తగ్గడం ముఖ్యమా భద్రత ముఖ్యమా అని ప్రశ్నించారు. ఇటీవల సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల చేశారని కాఫర్ డ్యామ్ నుంచి సీపేజ్ వస్తుందని వాటిని అరికట్టే చర్యలు తీసుకుని ముందుకు సాగాలని, డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయింది దానిని నిర్మాణం చేపట్టాలన్నారు. 2018లోనే కాఫర్ డ్యామ్‌తో డేంజర్ అని పత్రికాముఖంగా తాను చెప్పానన్నారు. ఇప్పుడు విదేశీయుడిని తీసుకువచ్చి సరిగ్గా కట్టలేదంటే కాంట్రాక్టర్ల వైఫల్యమా, ప్రభుత్వాల వైఫల్యమా అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో ఎల్‌అండ్‌టీ, నవయుగ, మెగా కంపెనీలను బాధ్యులుగా చేసి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రజల సొమ్ము వృథా అయ్యిందని తప్పు ఎవరదని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును ప్రభుత్వాలు ఏటీఎంలుగా చేసుకున్నాయి తప్ప భద్రత పట్టించుకోలేదన్నారు. గైడ్ బండ్ కుంగిపోయిన సంఘటనపై కూడా వాళ్లిచ్చిన వివరణ సహేతుకంగా లేదన్నారు. ప్రాజెక్టు విషయంలో జరిగిన తప్పులు, ఖర్చులు నష్టాలపై హైకోర్టులో తాను పిల్ వేస్తానని చెప్పారు.

కాకినాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం రూరల్, జూలై 4: పిఠాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాపర్తి ఫీడర్‌పై విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా భోగాపురం, రాపర్తి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.



జగ్గంపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు, విద్యార్థులు

పలుచోట్ల విద్యాసంస్థల బంద్

పిఠాపురం, జూలై 4: నీట్, నెట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీల సంఘటనలకు వ్యతిరేకంగా ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను మూసివేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పేపర్‌లీకేజీలు, అవకతవకలకు కేంద్రబిందువైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరేవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, సిద్ధు, లోవరాజు, వెంకటేష్, ప్రకాష్, అయ్యప్ప, జానీ, తేజ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: పట్టణంలో విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల బంద్ చేపట్టగా ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ(వి), ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాలు పాల్గొన్నాయి. యూనివర్సిటీల్లో విద్యార్థులపై నమోదు చేసిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు సతీష్, మణికంఠ, అరుణ్, సతీష్, వెంకట్, సాయి ఉన్నారు.

ప్రత్తిపాడు: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్‌లో భాగంగా మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు మూతపడ్డాయి. జడ్పీహై స్కూల్, మండల పరిషత్ పాఠశాలలు, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు బంద్ పాటించి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

7200 గృహాలు పూర్తి చేయాలి : డిప్యూటీ కలెక్టర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 4: హౌసింగ్ జిల్లా ప్రధాన కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఇంజనీర్లు ఇతర జిల్లా కార్యాలయ సిబ్బందితో డిప్యూటీ కలెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్ (హౌసింగ్) ఎన్‌వీవీ సత్యనారాయణ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ సెక్రటేరియట్‌లో చర్చించిన అంశాలు తీసుకున్న నిర్ణయం ప్రకారం వంద రోజుల ప్రణాళిక ప్రకారం 1లక్షా28వేల గృహాలు పూర్తి చేయడంలో భాగంగా కాకినాడ జిల్లాకు సంబంధించి 7,200 గృహాలు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని కార్యాలయంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేశారు.

'నూతన మండలం ఏర్పాటు చేయాలి'

ప్రత్తిపాడు, జూలై 4: నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన ప్రాంతాన్ని ప్రత్యేకంగా పెదమల్లాపురం కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజన హక్కుల సాధన సంఘం, సమతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గురువారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాకు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులను రంపచోడవరం ఐటీడీఏలో విలీనం చేసి షెడ్యూల్ ప్రాంతంగా గుర్తించి ఐటీడీఏ పథకాలు, సౌకర్యాలు సబ్‌ప్లాన్ గిరిజనులకు వర్తించేలా ప్రభుత్వం పనులు చేపట్టాలని కోరారు. పెదశంకర్లపూడిలో ఇటీవల మృతిచెందిన సూరాబత్తుల గంగ, సూరాబత్తుల నూకరాజు, మొల్లేటి రాంబాబు, గొంతిరెడ్డి మంగయమ్మ కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. టీడీపీ నాయకులు వరుపుల రామకృష్ణ, సుర్ణీడి సురేష్, జువ్విన తిరుపతిరావు, దళే నవీన్ పాల్గొన్నారు.

'విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి'

సామర్లకోట, జూలై 4: ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇవ్వడమే గాక పలు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నందున ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలని ఎంఈవో వై.శివరామకృష్ణయ్య పేర్కొన్నారు. సామర్లకోట మండలం మాధవపట్నం జమునానగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వెంకటకృష్ణరాయపురం, సత్యవరపుపేటలలో మండల పరిషత్ పాఠశాలలను గురువారం ఎంఈవో సందర్శించారు. ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయన్న సమాచారం ఉన్నందున ప్రతీ పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజనం స్వీకరించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనని ఎంఈవో సూచించారు.

'ఎమ్మెల్యే చొరవతో రైతులకు ధాన్యం సొమ్ములు'

కరప, జూలై 4: కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ చొరవతో రైతుల ఖాతాల్లో ధాన్యం సొమ్ములు పడ్డాయని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి తెలిపారు. జడ్.భావారం, గొడ్డటిపాలెం గ్రామాల్లో గురువారం మురళి పర్యటించి రైతులతో ముచ్చటించారు. ఎమ్మెల్యే చొరవతో మండలంలోని ఆయా ఆర్‌బీకేల ద్వారా 433 మంది రైతుల ఖాతాలకు పెండింగ్‌లో ఉన్న రూ.4కోట్ల41లక్షల30వేల488 బుధవారం రాత్రి విడుదలయ్యాయన్నారు. పలువురు రైతులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాయకులు వి.ముత్యాలరావు, గుణ్ణం ఉదయశంకర్, టీడీపీ నాయకులు పాలిక సూరిబాబు, రైతులు కొప్పిశెట్టి బుజ్జి, సీహెచ్.శ్రీను, జి.శ్రీను, బాబ్జి పాల్గొన్నారు.

'హిందూ సంస్కృతి పరిరక్షణే ధ్యేయం'

కరప, జూలై 4: హిందూసంస్కృతి సంప్రదాయాల పరిరక్షణే ధ్యేయంగా సమరసత సేవా ఫౌండేషన్ పనిచేస్తుందని ఆ సంస్థ జిల్లా ధర్మప్రచారక్ పడాల రఘు తెలిపారు. నడకుదురులో గురువారం ఆయన మాట్లాడారు. గురుపౌర్ణమి నుంచి ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో బాల వికాస కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈనెల 5నుంచి 7వరకు సింహాచలంలో మాతాజీలుకు శిక్షణా తరగతులు జరుగుతాయన్నారు. 8న కాకినాడజిల్లా స్థాయి మహిళా సమావేశాన్ని ప్రత్తిపాడులో నిర్వహించనున్నామని, మండల మహిళా కన్వీనర్లు, సహ కన్వీనర్లు ఈ సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఖండ కన్వీనర్ ముమ్మిడి శ్యామ్‌సుందర్‌రావు, మండల కన్వీనర్ ముమ్మిడి పెదకాపు, ఆలయ పూజారి కలకురస వెంకటరమణ పాల్గొన్నారు.

'35శాతం మాత్రమే నాట్లు పూర్తి'

గండేపల్లి, జూలై 4: మండలంలో ఇప్పటి వరకు 35శాతం మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయని ఏవో సద్గురుమూర్తి అన్నారు. గురువారం మురారిలో క్షేత్రస్థాయిలో పొలాల సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని, ఈనెల 20లోపు రైతులు వందశాతం వరినాట్లు వేసుకోవాలని, నాటేటప్పుడు వరినారు సుతలు తుంచడం ద్వారా కాండం తొలుచుపురుగు చేసే నష్టాన్ని నివారించవచ్చన్నారు. మురారి 1 ఉద్యాన సహాయకులు ఎస్.దుర్గాప్రసాద్ ఉన్నారు.

ఫొటో,వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం

తాళ్లరేవు, జూలై 4: ప్రొఫెషనల్ ఫొటో,వీడియోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ 6వ సర్వసభ్య సమావేశం తాళ్లరేవు లయన్స్‌క్లబ్‌హాల్లో మండలాధ్యక్షుడు సలాది యేసుబాబు అధ్యక్షతన జరిగింది. కెమెరా సృష్టికర్త డాగూరే చిత్రపటానికి ఫొటోగ్రాఫర్ల జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గం సభ్యులు నాగీడి రామాంజనేయులు, తొగరు కృష్ణమూర్తి, పితాని ఆంజనేయులు, పొన్నగంటి శ్రీనివాస్, పేపకాయల బద్రి, సయ్యద్‌ఖాన్, మండా రమేష్, పెట్ల శ్రీను, వరహాలరాజు, కుక్కల సతీష్ పాల్గొన్నారు

అల్లూరికి ఘన నివాళి

» మన్యం వీరుడి జయంతి వేడుకలు
» విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసిన నాయకులు, అధికారులు





పెద్దాపురంలో అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప...కరప, కిర్లంపూడి, ప్రత్తిపాడులో అల్లూరికి నివాళులర్పిస్తున్న దృశ్యాలు

పెద్దాపురం, జూలై 4: మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం పాతబస్టాండ్ ఆవరణలో ఉన్న అల్లూరి విగ్రహానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజప్ప మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన విప్లవవీరుడు, ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన ధీశాలి అల్లూరి సీతారామరాజు అన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, రాజా సూరిబాబు రాజు, పోలమరశెట్టి సత్తిబాబు పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో సీతారామారావు అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పిఠాపురం: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ, జనసేన నాయకులు పిలుపునిచ్చారు. అల్లూరి జయంతి సందర్భంగా పిఠాపురం తహశీల్దారు కార్యాలయం సెంటర్‌లోని సీతారామరాజు విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల వెంకటసూర్యనారాయణరాజు, కార్యదర్శి గండి కొండలరావు, ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, తోట ఏడుకొండలు, జనసేన సంయుక్త కార్యదర్శి సూరిశెట్టి జయకృష్ణ, పసుపులేటి సత్యనారాయణ, ఓలేటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: 16వ జాతీయరహదారిపై వన్నెపూడి-కొడవలి సెంటర్ వద్ద గల అల్లూరి విగ్రహానికి జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్, అల్లూరి సీతారామరాజు యూత్‌కమిటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన కొడవలి గ్రామకమిటీ అధ్యక్షుడు నక్కా నారాయణమూర్తి, మద్దాల రామకృష్ణ, కోటేశ్వరరావు, నాగార్జున, ప్రకాష్, పండు, వంశీ, సింహాద్రి, కృష్ణ, అర్జున్ తదితరులు ఉన్నారు.

కరప: కరప ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అల్లూరి విగ్రహానికి ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం ఏవో గుత్తుల భీమశంకరరావు, సిబ్బంది వీరేష్, రాయుడు, సురేష్ ఉన్నారు. గురజనాపల్లి హైస్కూల్ పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి, జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య, స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వీరమణమూర్తి, ఎం.ప్రభారాణి, సూర్యనారాయణ ఉన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలోని వినోద్ మిశ్రా నగర్‌లో సీపీఐ (ఎంఎల్) పార్టీ, భద్రవరం, లింగంపర్తిలో అల్లూరి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాకల పాటి సోమరాజు, గండేటి నాగమణి, పిల్ల రాంబాబు, కందుల వరలక్ష్మీ, గుమ్మడి పాదాలమ్మ, గూనాపు సాయి, కాకర నాగమణి, కోన గంగాధర్, గుండువెల్లి చక్రం, ద్వారపురెడ్డి ప్రసాద్, వేమగిరి దొంగబాబు, బత్తుల వీర్రాజు, రౌతు సత్యనారాయణ అధ్యాపకులు ప్రయాగ మూర్తి, బంగార్రాజు, శ్రీలక్ష్మీ, మదీన పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పి.వెంకటనారాయణ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల పరిషత్ సిబ్బంది సుబ్రహ్మణ్యం, భాస్కరశర్మ, విద్యాశాఖ సిబ్బంది అడపా గణేష్, సీఆర్పీ గంగాధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: సామర్లకోట తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్ అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీఆర్వోలు పద్మనాభం, సుబ్బారావు, నలజర్ల మురళీకృష్ణ, శ్రీహరి పాల్గొన్నారు. అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అల్లూరి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయిరామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవీఆర్ఎస్ వల్లీ, కె.శ్రీనివాస్, ఏ.శ్రీవల్లీ, బి.శ్రీలక్ష్మీ, బేబీ రాణీ, పి.బ్రహ్మానందం, భార్గవి, పీపీఎస్‌లక్ష్మీ, లక్ష్మీదుర్గ, బాలశైలజ విద్యార్థులున్నారు.

జగ్గంపేట: రావులమ్మనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ అప్పలరాజు,మారిశెట్టి భద్రం, కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, కుంచే రామకృష్ణ, ఎస్వీ ప్రసాద్, కాళ్ల వెంకటేష్, కొండ్రోతు శ్రీను, కరణం బురయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా చినశంకర్లపూడిలో టీడీపీ నాయకులు మిరియాల శ్రీను, కర్రి దుర్గ, పి.కిరణ్, ఆకేటి రాజు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడులో అల్లూరి విగ్రహానికి కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను, కార్యకర్తలు అల్లూరి విగ్రహానికి నివాళులర్పించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, యూటీఎఫ్ నాయకులు ఎస్.సూర్యనారాయణ, రామలింగేశ్వరరావు, ఎండీ రమణ, సాల్మన్‌రాజు, మహేష్ అల్లూరి విగ్రహానికి నివాళులు అర్పించారు.

కిర్లంపూడి: తామరాడలో అల్లూరి విగ్రహానికి జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పూలమాలలు వేశారు. బూరుగుపూడిలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేశారు. వల్లూరి రాజబాబు పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడిలో అల్లూరి విగ్రహాలకు టీడీపీ నేతలు ఇటంశెట్టి అశోక్, పైలా అశోక్ పూలమాలలే వేసి నివాళులర్పించారు. రహదారి పక్కన యువకులతో కలిసి అశోక్ మొక్కలు నాటారు.

తాళ్లరేవు: తాళ్లరేవు గ్రామపంచాయతీలో ప్రజా సంఘాల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అల్లూరి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

తుని రూరల్: తని పట్టణ ప్రధాన కూడలి అయిన గొల్ల అప్పారావు సెంటర్‌లో ఆయన విగ్రహానికి క్షత్రియ పరిషత్‌సభ్యులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశో క్‌బాబు, దంతులూరి శ్రీనివాసరాజు, చిరంజీవిరాజు, వర్మ, టీడీపీ నాయకులు మళ్ల గణేష్, అల్లు రాజు, జల్లు వాసు,సిద్దాంతపు సత్తిబాబు తదితరులున్నారు.

సాగునీరందించాలని కోరాను

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


సమావేశంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, జూలై 4: జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కోసం పిఠాపురం ఎమ్మెల్యే సీటును త్యాగం చేసినప్పుడు టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబును తాను పదవి కోరలేదని, రైతులు కోసం పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకాన్ని తిరిగి ప్రారంభించి సాగునీరు అందించాలని కోరానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. అన్న మాట ప్రకారం పథకాన్ని ప్రారంభించి గోదావరి జలాలను విడుదల చేయడం జరిగిందని చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ సాగునీటి కోసం పిఠాపురం నియోజకవర్గ రైతులు పడుతున్న కష్టాలను చంద్రబాబు పాదయాత్ర సమయంలో స్వయంగా చూశారని, తాను ఎమ్మెల్యేగా ఉండగా ఆయనను ఒప్పించి రూ.1750కోట్లుతో పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి 9నెలల్లో ప్రారంభించడం జరిగిందన్నారు. తాను సీటు త్యాగం చేసినప్పు తనకు చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకానికి సాగునీరు విడుదల చేసిన నీటిపారుదలశాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పదవులు కోసం ఆశ పడకుండా రైతులు బాగుకోసమే తాను పనిచేశానని తెలిపారు. మరో 2రోజుల్లో పురుషోత్తపట్టణ ఎత్తిపోతల పథకం ద్వారా ఏలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు చేరతాయని తద్వారా రైతులకు పంటలు పండించేందుకు సాగునీటి కష్టాలు ఉండవన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, సకుమళ్ల గంగాధర్, గుండ్ర సుబ్బారావు, మడికి ప్రసాద్, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, పిల్లి చిన్నా ఉన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి



పిఠాపురంలో కేక్ కట్ చేస్తున్న కాపు సంఘం నాయకులు, కొత్తపల్లి కేక్ కట్ చేస్తున్న యువకులు

పిఠాపురం, జూలై 4: పట్టణంలో గురువారం కాపు సంఘం నేత వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిఠాపురం కాపు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి రంగా అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. ఉప్పా డ సెంటర్‌లో భారీ కేక్‌ను కట్ చేశారు. నాయకులు మనకపల్లి బన్ను, బొజ్జా ఈశ్వర్‌తేజ్, కొత్తెం సుందరకుమార్, బొజ్జా లోవరాజు, దేవరపల్లి చినబాబు, ఆగంటి ప్రభాకరరావు, పలనాటి మధుకుమార్, కొత్తెం రాజు, బాబూరావు, బొజ్జా కుమార్, వొగేటి మురళీధర్, చక్రవర్తుల శ్రీను, దాసరి రామకృష్ణ పాల్గొన్నారు.

జగ్గంపేట: రామవరంలో రంగా విగ్రహానికి జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. రామవరం యూత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మేక వీరబాబు, రామవరం ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మొగలి గంగాధర్, గవర సుధాకర్, నరేష్, మాదారపు వీరబాబు, పబ్బిరెడ్డి మణికంఠ, మణికంఠ పాల్గొన్నారు.

పెద్దాపురం: కాండ్రకోట గ్రామంలో వంగవీటి రంగా విగ్రహానికి గుడా మాజీ డైరక్టర్ ఎలిశెట్టి నాని రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గవరసాన శివరామకృష్ణ, బొరుసు రాజు, తదితరులున్నారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలు పట్టణం, మండలపరిధిలోని గ్రామాల్లో రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు జ్యోతుల సురేష్ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమక్షంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దివ్యాంగులకు కాయగూరలు, పింఛన్ అందక ఇబ్బందిపడుతున్న కాశీ బేగంకు రూ.5వేలు, ఓరుగంటి శివకు వీల్‌ఛైర్, బియ్యం అందజేశారు. మేడిశెట్టి నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోలా దుర్గ, ఉరుకూటి దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో వైఆర్సీ వద్ద యూత్ సభ్యులు వంగవీటి మోహన్‌రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, గూడపాటి శేఖర్, తిక్కిశెట్టి స్వామికమల్, రాజపోతు శ్రీను, అడపా శేషగిరిరావు, బాదం ఆనంద్, సఖిరెడ్డి వంశీ, పలివెల శివరాజ్, వడ్డాది శివకృష్ణ పాల్గొన్నారు.

తునిరూరల్: ఎస్.సూరవరం, తేటగుంట, మర్లపాడు, దొండవాక, తదితర గ్రామాల్లో రంగా విగ్రహాలకు పలువురు ప్రముఖులు, కాపు యువజనసంఘ నాయకులు నివాళులర్పించారు. ఎస్.సూరవరంలో టీడీపీ నేత చింతమనీడి నాగ సోమరాజు వేడుకల్లో పాల్గొని మాట్లాడారు.

కొత్తపల్లి: కొత్తపల్లి ఊరచెరువు గట్టు వద్ద ఏర్పాటుచేసిన రంగా విగ్రహం వద్ద కాపు నాయకులు గవర రాంబాబు, గవర నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ప్రయాణికులు, బాటసారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కాపు నాయకులు డాక్టర్ పిల్లా శ్రీధర్, శివశంకర్, చింతలపూడి రమణ, గంధం గంగ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి, రాచపల్లిలో కాపు సంఘాల నాయకులు రంగా విగ్రహాలకు పూలమాలలు వేశారు. కాపు యువజన సంఘం నాయకులు మిరియాల శ్రీను, ముత్యాల వినయ్, గాబు హరిబాబు, కర్రి దుర్గ, సోము కల్యాణ్, బండి మహేష్,ఉలిగంపల నాని, గంధంకొండమ్మ, బేశెట్టి అనీల్, మర్రి చంద్రరావు ఉన్నారు.

చిన్నారుల మానసిక వికాసానికి అంగన్‌వాడీలు దోహదం

సర్పవరం జంక్షన్, జూలై 4: చిన్నారులు, గర్భిణులకు మెరుగైన పౌష్టికాహారం అందించడంతో పాటూ చిన్నారుల మానసిక వికాసం, ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. గురువారం రమణయ్యపేట ఒకటో డివిజన్‌లో కమ్యూనిటీ హాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ పిలుస్తోంది, అన్న ప్రాసన, సామూహిక సీమాంతాల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పిల్లల సంరక్షణపై సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ, డిప్యూటీ మేయర్ కాళ్ల సత్తిబాబు, మాజీ కార్పొరేటర్లు పేరాబత్తుల లోవబాబు, పలివెల త్రిమూర్తులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, శిరంగు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంతం నానాజీ

'వాహనాల మరమ్మతులు పూర్తి చేయాలి'

కార్పొరేషన్(కాకినాడ), జూలై 4: పారిశుధ్య సేవల కోసం వినియోగించే డంపర్‌బిన్లు, పుష్‌క్యాట్, ఇతర వాహనాల మరమ్మతులను సత్వరమే చేపట్టి పూర్తి చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన బొందగుంటలోని వెహికల్ యార్డ్‌ను సందర్శించారు. వాహనాలను శుభ్రం చేసేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపును పరిశీలించారు. వాహనాల పనితీరుపై ఆరాతీశారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో మెరుగైన పారిశుధ్య సేవలందించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఈఈ మాధవి,ఏఈ నాగేశ్వరరావు ఉన్నారు.



చిరు ధాన్యాల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు

డీఏవో విజయకుమార్

పెద్దాపురం, జూలై 4: ప్రభుత్వం చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. మండలంలోని వాలుతిమ్మాపురంలో భారత ప్రభుత్వం చిరుధాన్యాల సాగుకు ఇస్తున్న ప్రోత్సాహకంలో భాగంగా రైతులతో క్షేత్రస్థాయి అవగాహనా సదస్సు నిర్వహించారు. గతంలో కరపెండలం దుంపసాగు చేసిన రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. మెట్ట ప్రాంతంలో వాతావరణం రాగులు వంటి చిరుధాన్యాల పంటలకు అనుకూలమన్నారు. రైతులు ప్రయోగాత్మకంగా జూలై నెలాఖరులోపు ఎకరానికి 3 కిలోల చొప్పున రాగులు విత్తనాలు వేసుకున్నట్లైతే 120 రోజుల పంట కాలం తర్వాత ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ళ దిగుబడులు వస్తుందని డీఏవో తెలిపారు. డీడీఏ శ్రీహరి మాట్లాడుతూ మెట్టలో కరపెండలం పంటకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాలు వేసి రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చన్నారు. గెడ్డం ఏసుబాబు, బూసి శ్రీను, పితాని వీరభద్రరావు, భీమరాజు, ఏడీఏ మాధవి, ఎన్.దైవకుమార్, కె.సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గాడలో ఉద్రిక్తత

గొల్లప్రోలు రూరల్, జూలై 4: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో రెండు సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన వివాదం గురువారం రాత్రి ఉద్రిక్తతలకు దారితీసింది. గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చింపివేయడం ఈ వివాదానికి కారణమైంది. వంగవీటి మోహన్‌రంగా జయంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీలోని కొందరు వ్యక్తులే ఈ సంఘటనకు పాల్పడ్డారని మరో సామాజికవర్గం నేతలు ఆరోపిస్తున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. పిఠాపురం సీఐ శ్రీనివాస్ ఆందోళనకారులతో చర్చించారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

తునిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చొరవచూపాలి : ఎమ్మెల్యే

తునిరూరల్, జులై 4: తునిలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చొరవచూపాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య వైద్యాఆరోగ్యశాఖ మంత్రిని కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి సత్యకుమార్‌ని కలిసి కళాశాల ఏర్పాటుకు సంబంధించిన అనుమతులు త్వరతగతిన ఇవ్వాలని కోరుతూ నియోజకవర్గంలో వైద్యఆరోగ్య పరిస్థిలు మంత్రికి వివరించగా కళాశాల ఏర్పాటుకు మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు.

మాజీ గవర్నర్ రోశయ్యకు నివాళి

తుని రూరల్, జూలై 4: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 91వ జయంతిని పురస్కరించుకుని తునిలో ఆర్య వైశ్యులు నివాళులర్పించారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు కొనియాడారు. మండల ఆర్యవైశ్య సంఘ సభ్యులు, శ్రీవాసవి కన్యకాపరమేశ్వర అమ్మవారి దేవస్థానం సభ్యులు ఉన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు జరిగిన కార్యక్రమానికి ఆర్యవైశ్య మండలాధ్యక్షుడు చిత్రబాబు అధ్యక్షత వహించగా స్థానిక మండలాధ్యక్షుడు అట్లూరి నాగబాబు, పలువురు నేతలు రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సభ్యులు కొత్త కొండబాబు, కొత్త భైరవ కృష్ణ, కొత్తరాబు, రాంపండు ఉన్నారు.

వివేకానంద విగ్రహానికి నివాళి

ఏలేశ్వరం, జూలై 4: స్వామి వివేకానందా వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలో బాలికోన్నత పాఠశాల వద్ద మున్సిపల్ కౌన్సిలర్ అలమండ చలమయ్య ఆధ్వర్యంలో వివేకానందుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.సుమలత, శిడగం వెంకటేశ్వరరావు, తూమురౌతు గురవయ్య, అలమండ దుర్గా వెంకటప్రసాద్, కటకం కిరీటి, బోద చిరంజీవి, అలమండ పెద చలమయ్య, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన తమరాల

రౌతులపూడి, జూలై 4: అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఆయన నివాసంలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ కలిసి అభినందనలు తెలిపారు. మాజీ సర్పంచ్‌లు పైల సాంబశివరావు, గొల్లు పెద్దదివాణం, గాడిరాంబాబు, చిటకేల వాసు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లావణ్యకుమారి

జీజీహెచ్ (కాకినాడ), జూలై 4: కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి గురువారం కాకినాడలో జిల్లా టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆసుపత్రికి చెందిన అంశాలపై ఎమ్మెల్యే దృష్టికి ఆమె తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అనిత పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్

తాళ్లరేవు, జూలై 4: పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది వెటర్నరీ డిస్పెన్సరీ ఆసుపత్రిలో ఈనెల 6న ప్రపంచ కుక్కల దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రాబీస్ వ్యాక్సిన్ వేయనున్నట్టు పశువైద్యాధికారిణి డాక్టర్ సుధ గురువారం తెలిపారు. గ్రామాల్లో కుక్కలను పెంచు కునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేను బడికి పోతా ర్యాలీ

ఏలేశ్వరం, జూలై 4: నేను బడికి పోతా కార్యక్రమంలో గురువారం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పట్టణ వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రధానోపాధ్యాయులు సుమలత మాట్లాడుతూ బడి మానేసిన విద్యార్థులను గుర్తించి బడికి వచ్చే విధంగా చేయడమే ముఖ్య ఉద్దేశమన్నారు. జి.సత్యనారాయణ, రాజా, రామలక్ష్మీ, ఎమ్.రాము తదితరులున్నారు.

కోలాట బృందానికి ఆర్థికసాయం

ప్రత్తిపాడు, జూలె 4: మండలంలోని వేములపాలెంలో చింతాలమ్మతల్లి కోలాట బృందం కమిటీకి గురువారం సీమాంధ్రబీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఒమ్మి గంగరాజు రూ.5116లు సహాయం అందించారు. సంస్కృతి, సంప్రదాయాలను శ్రీ కృష్ణ పరమాత్మ భక్తి గేయాల ద్వారా ప్రజల్లోకి మరింత తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కమిటీ నాయకులు పి.తాతబాబు, ఎం.రాజారావు, శివకుమార్, ఎ.ఆదినారాయణ, వెంకన్నబాబు,వరాలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కిర్లంపూడి, జూలై 4: మండలంలోని తామరాడలో గోకేడ రాంబాబు దంపతులు కుమార్తె స్వర్ణభారతి 26వ జయంతి సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 13మంది యువకులు రక్తదానం చేశారు. ప్రత్తిపాడు పీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య పర్యవేక్షణలో ఈ శిబిరం నిర్వహించారు. తోట సునీత సర్వారాయుడు, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మపల్లి రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాట్ల పరామర్శ

తాళ్లరేవు, జూలై 4: గోవలంక సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ భర్త సూరిబాబు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పరామర్శించారు. ప్రభుత్వపరంగా బాధిత కుటుంబాన్ని ఆదుకుంటానని ఆయన భరోసా కల్పించారు. వేగేశ్న భాస్కరరాజు, సాగి బాబ్జి రాజు, బోయిడి వేణుగోపాల్, శ్రీనురాజు, వీరపండు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

జగ్గంపేట, జూలై 4: జగ్గంపేటలో ఈనెల 9న నిర్వహించే ఐఎఫ్టీయూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అధ్యక్షుడు ఏసు, గంటా బాలరాజు, కనకారావు, నాగు తదితరులు పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE FAMILY JUDGE CUM V ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P.1944/2023

Between:
Smt. Kattoju Sowmya ...Petitioner
And
Sri Kattoju Lova Raju ...Respondent

NOTICE

To, **The Respondent:**
Sri Kattoju Lova Raju,
S/o. Late Satyanarayana, Hindu, aged about 40 years, R/at D.No.5-1-91/1, Seethayya gari thota, Ex-MLA Street, Pitapuram, East Godavari Dist-533 450

Please take notice that the above FCOP.1944/2023 filed by the petitioner against the respondent for decree of divorce, dissolving the marriage dt. 15-04-2012, under Section 13 (1) (ib) of Hindu Marriage Act., and the matter stands posted to **23-07-2024** for your appearance on that day at **10:30 A.M.**, you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence.

(By Order of the Hon'ble Court)
TELU JAGADESWARA RAO, Advocate
Visakhapatnam, **Cell: 8143888573.**

శ్రీ భావనారాయణస్వామి వారి దేవస్థానం
(దేవదాయ ధర్మాదాయశాఖ), సర్పవరం గ్రామం, కాకినాడ(రూ) మండలం, తూ.గో.జిల్లా

భూమి కౌలు హక్కు టెండర్ కమ్ బహిరంగవేలం ప్రకటన

కాకినాడ జిల్లా, సర్పవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ భావనారాయణ స్వామివారి దేవస్థానం యొక్క పూర్తి హక్కుభుక్తములైనటువంటి గొల్లప్రోలు మండలం ఎ.విజయనగరం గ్రామములో గల ఈ దిగువ షెడ్యూలు [illegible] భూమిని సేద్యము చేసుకొని అనుభవించే హక్కును [illegible] శ్రీయుత ప్రాంతీయ సంయుక్త కమీషనరు, మల్టీజోన్-1, దేవదాయ ధర్మదాయశాఖ, రాజమహేంద్రవరం వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ది.11-07-2024 గురువారం ఉదయం 11-00 గం.లకు గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద, తనిఖీదారు, దేవదాయ ధర్మదాయశాఖ, కాకినాడ వారి సమక్షమున ఆలయ కార్యనిర్వాహణాధికారి వారిచే బహిరంగవేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తిగలవారు పాల్గొనవలసినదిగా తెలియపర్చడమైనది.
ఆంధ్రప్రదేశ్, హిందూ దేవదాయ-ధర్మదాయశాఖ చట్టము 30/87 జరిగిన సవరణకులోబడి జి.ఓ.ఎమ్.ఎస్.నెం.425 రెవిన్యూ ఎండోమెంట్స్-1 నందు పొందుపర్చిన నిబంధనలు అనుసరించి సదరు భూమి కౌలుకు బహిరంగవేలంపాట జరుపబడును. పాటదారు హిందు మతస్థులై ఉండాలి. మిగిలిన వివరములకు సంప్రదించవలసిన నెంబర్లు:9290550872, 9704197952.

వ.నెం	భూమి ఉన్న గ్రామం & మండలం	సర్వే నెం	భూమి విస్తీర్ణం ఎ.సెం.	భూమి స్వభావం	పాట ధరావత్తు రూ.పై	సాల్వెన్సీ సర్టిఫికెట్ విలువ	కౌలు కాలపరిమితి
1	ఎ.విజయనగరం గొల్లప్రోలు మండలం	486/8 534/1 534/3	2-42 0-95 2-17				2024-25 నుండి 2026-27 వరకు (3సం.లు మాత్రమే)
			5-54	మెట్ట	10,000/-	3,00,000/-	

సర్పవరం
ది. 04-7-2024
ఇట్లు:
కార్యనిర్వాహణాధికారి